సాక్షి
మెదక్
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



నేరస్తులపై నజర్

పాత నేరస్తులు, నాటుసారా, బెల్ట్‌షాపుల విక్రయదారులు, రౌడీషీటర్ల కదలికపై పోలీసులు దృష్టిసారించారు. వివరాలు II లో ▸



దళారులను నమ్మకండి

ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అధికారులు సూచిస్తున్నారు. వివరాలు III లో ▸



దాడి అమానుషం

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం అమానుషమని పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. వివరాలు III లో ▸

సింగూరుకు గోదావరి జలాలు

కాళేశ్వరం అనుసంధానంతో శాశ్వత జలవనరు..

- బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా.. 1.80 లక్షల ఎకరాలకు సాగు నీరు
- నల్లవాగుకు ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తాం
- మళ్లీ గెలిపిస్తే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

నారాయణఖేడ్: జిల్లాలోని బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసుకొని 1.80 లక్షల ఎకరాలకు సాగుకు నీటిని అందిద్దామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. సింగూరు ప్రాజెక్టు ఎండిపోకుండా ఉండేందుకు కాళేశ్వర ప్రాజెక్టును సింగూరుకు అనుసంధానం చేస్తే ఇది శాశ్వతమైన జలవనరుగా తయారవుతుందన్నారు. ఇక ఎన్నడూ సింగూరు ఎండిపోయే పరిస్థితి ఉండదని వివరించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. నారాయణఖేడ్, జహీరాబాద్‌లకు లిఫ్టలను ఏర్పాటు చేసుకొని సాగునీటిని పొందవచ్చని అన్నారు. మల్లన్నసాగర్ నుంచి వచ్చే కాలువ నర్సాపూర్ వరకు తవ్వారన్నారు. ఈ ప్రాంతం వరకు పూర్తి చేస్తే తద్వారా కూడా 40 వేల ఎకరాలకు నీరు రానుందని అన్నారు. నల్లవాగు ప్రాజెక్టు రెండు పంటలు పండించుకునేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారన్నారు. ఈసారి గెలిపిస్తే ఏర్పాటు చేయనున్నట్లు సభా ముఖంగా వాగ్దానం చేశారు. బీసీ గురుకులాలు, నారాయణఖేడ్– మాసాన్‌పల్లి డబుల్ రోడ్డును మంజూరు చేస్తామని హామీనిచ్చారు. నాయకులు ఓట్లు అడగడానికి వచ్చినపుడు ప్రజలు ఆగం కాకూడదన్నారు. ఎవరి చరిత్ర.. ఎవరి వైఖరేందో? ఎవరు ఏంచేస్తారో? చూడాలని అన్నారు. మన రాష్ట్రం ఏర్పాటు కాక ముందు కరెంటు పరిస్థితి ఎలా ఉంది? తాగుసాగు నీరు, పంటల పరిస్థితి ఎలా ఉందో? ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని కోరారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి వచ్చి 5 గంటల కరెంటు ఇస్తున్నామని చెబుతున్నాడని ఆయనకు సిగ్గుండాలన్నారు. 24 గంటలు కరెంటు ఇస్తున్న మన రాష్ట్రానికి వచ్చి ఆ విషయాన్ని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్‌లో మంచి నాయకుడన్నారు. ఆయన్ను ప్రజాప్రతినిధిగా ఎన్నుకోక ముందు తండాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గెలుపొందాక ఎన్ని తండాలకు రోడ్లు వేసుకున్నామో? ప్రజలు మననం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 100 తండాలను పంచాయతీలుగా మార్చుకున్నామని గుర్తుచేశారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేసుకున్నట్లు ప్రకటించారు. పోడు భూములు పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో జరగని, ఊహించని ఈ మంచి పనులు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఎన్నికల్లో భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, తాను మళ్లీ స్వయంగా వచ్చి బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్‌ను ప్రారంభోత్సవం చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఉన్న నారాయణఖేడ్‌కు, నేడు బీఆర్‌ఎస్ పాలనలో ఉన్న నియోజకవర్గానికి .. భూమికి ఆకాశానికి ఉన్న తేడా ఉందని చెప్పారు. నాడు రేకుల ఇళ్లు ఉండగా నేడు శ్లాబ్ బిల్డింగులు కన్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు వచ్చేందుకు భయపడే వారని, ఇప్పుడు పరిస్థితి మారందని అన్నారు. ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు వచ్చాయన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్– మాసాన్‌పల్లి డబుల్‌లైన్ రోడ్డు ఏర్పాటు, నల్లవాగు ప్రాజెక్టు కింద రెండు పంటలు పండేందుకు రూ.80 కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాలను మెదక్ జిల్లా నుంచి సంగారెడ్డి జిల్లాలోకి మార్చాలన్నారు. ఖేడ్‌లో నాలుగు బీసీ గురుకులాలను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, ఎమ్మెల్సీ నరోత్తంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



అరవింద్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ గురుకుల కళాశాల విద్యార్థి అరవింద్ 45వ సీనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 4 నుంచి 8 తేదీ వరకు జమ్మూ కాశ్మీర్ (బక్షి స్టేడియం)లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో అరవింద్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అరవింద్‌ను ప్రిన్సిపాల్ భిక్షమయ్య, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, వెంకటయ్య , సురేంద్ర, కోచ్ శానవాజ్, పీడీ సుజాత, రాజు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

మహిళల సంరక్షణకు చర్యలు



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మహిళల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్ర, మహిళా శిశు సంక్షేమ శాఖ జెండర్ స్పెషలిస్టులు కవిత, నాగమణి తెలిపారు. సోమవారం పేటలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడ పిల్లలను చదివిద్దాం–రక్షిద్దాం, బాలికలకు, మహిళలకు అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ 181,1098,100 టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అనంతరం ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిస్తూ, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి



రాజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం చిలిపిచెడ్ మండలంలోని జగ్గంపేటకు చెందిన పలువురు రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌పై ప్రజలు విసిగిపోయారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో జగ్గంపేటకు చెందిన యాదాగౌడ్, బాబు, శేఖయ్య, శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాజిరెడ్డిని నాయకులు సన్మానించారు.

సంక్షేమ రాజ్యం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి



రామంతాపూర్‌తండాలో పర్యటిస్తున్న అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం స్థాపన బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యమని బీఆర్‌ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మాసాయిపేట మండలం రామంతాపూర్, లింగారెడ్డిపల్లి, రామంతాపూర్‌తండాలో ఎల్లమ్మ, సేవాలాల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేసిన పనులే తనను గెలిపిస్తాయని సునీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింలు, శ్రీను, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పూర్తి బాధ్యత పీఓలదే

- ఓటరు జాబితాలో పేరుంటేనే లోనికి అనుమతి
- జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఒక్కొక్క ఎలక్షన్‌కు నిబంధనలు మారుతున్న నేపథ్యంలో పీఓలు శిక్షణ తరగతులు శ్రద్ధగా విని ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సోమవారం జిల్లాలోని పీఓ, ఏపీఓ, పోలింగ్ సిబ్బందికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ట్రైనింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మాక్ పోలింగ్ ఉదయం 5.30 గంటల్లోగా పూర్తి చేయాలని, కనీసం ఇద్దరు ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకొని పోలింగ్ పూర్తయిన తర్వాత సాయంత్రం తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీఓలదేన్నారు. ఓటరు జాబితాలో పేరుంటేనే వ్యక్తులను లోనికి రానివ్వాలని సూచించారు. పోలింగ్ బూత్ ఏజెంట్ ఆ నియోజకవర్గంలోని ఓటరు అయి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర, ఆర్‌టీఓ అంబదాస్ రాజేశ్వర్, డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

జిల్లా అధికారులకు నితేష్ వ్యాస్ సూచనలు



హామీ పత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ కలెక్టరేట్: శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి నితేష్ వ్యాస్ ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి తూచా తప్పకుండా అమలు చేయాలని, సీ విజిల్ యాప్‌ను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ పద్మశ్రీ, డీఈఓ రాధాకిషన్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే, వందశాతం పోలింగ్ సాధించాలనే లక్ష్యంతో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శినితో కలిసి కలెక్టర్ కార్యాలయంలో భవిష్యత్ ఓటర్ల, యువ ఓటర్ల హామీ పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓలు అంబదాసు రాజేశ్వర్, శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారులు రాజిరెడ్డి, బ్రహ్మాజీ, ఎన్నికల నోడల్ అధికారులు రాధాకిషన్, విజయలక్ష్మి, సాయిలు, రవి ప్రకాశ్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలొస్తేనే దళితులు గుర్తొస్తారా?


ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నయ్య



మాట్లాడుతున్న రత్నయ్య

మెదక్: ఎన్నికలు రాగానే నాయకులకు దళితులు గుర్తుకొస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లారం రత్నయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా దళితులకు చేసిందేమి లేదన్నారు. అతికొద్ది మందికి మాత్రమే దళితబంధు ఇచ్చి దళితుల అభివృద్ధికి ఏదో చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. గతంలో మైనంపల్లి హన్మంతరావు దళితులకు మెదక్‌లో ఎస్సీ భవనాన్ని నిర్మించి ఇస్తానని చెప్పి, హామీని విస్మరించారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుపుల రత్నం, నాయకులు భిక్షపతి, రాములు, భూషణం, పవన్, భూమేశ్, జగన్, జయరాజ్, పద్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు



వాహనాలను తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

నర్సాపూర్: ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆదేశించారు. సోమవారం నర్సాపూర్‌లో పర్యటించారు. నామినేషన్లు స్వీకరించే ఆర్డీఓ కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిబంధనల మేరకు నామినేషన్లు వేసేందుకు వ్యక్తులను లోపలికి అనుమతించాలని సీఐ షేక్ లాల్‌మదార్‌కు సూచించారు. కాగా, నర్సాపూర్ –హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు.

కోరం లేక వాయిదా

మెదక్ కలెక్టరేట్: జెడ్పీ కార్యాలయంలో జరగాల్సిన స్థాయీ సంఘ సమావేశాలు కోరం లేక వాయిదా పడ్డాయి. సోమవారం వ్యవసాయం, స్త్రీ, శిశుసంక్షేమం, సాంఘీక సమావేశాలు జరగాల్సిన ఉంది. అధికారులు హాజరైనప్పటికీ జెడ్పీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశాలు వాయిదా వేసినట్లు జెడ్పీసీఈఓ శైలేష్ తెలిపారు.

వ్యవసాయ అనుబంధ వ్యాపారాలకే భవిష్యత్

విజ్ఞాన జ్యోతి చైర్మన్ అచ్యుతరాంప్రసాద్



సర్టిఫికెట్ అందజేస్తున్న రాంప్రసాద్

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయ అనుబంధ వ్యాపారులకు మంచి డిమాండ్, భవిష్యత్ ఉందని ఆర్‌వీజే చైర్మన్ అచ్చుత రాంప్రసాద్ తెలిపారు. తునికి వద్ద గల డాక్టర్ డీ.రామానాయుడు విజ్ఞాన జ్యోతి (ఆర్‌వీజే) గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థలో ఆర్‌వీజే, మేనేజ్ సంయుక్తంగా నిర్వహించిన అగ్రి క్లీనిక్ అండ్ అగ్రి బిజినెస్ సెంటర్స్ 45 రోజులు శిక్షణ పొందిన 35 మంది విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. శిక్షణ పొందిన విద్యార్థులు సొంతంగా వ్యాపారం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యాపారాలు చేసుకునేందుకు రూ.20 లక్షల వరకు రుణం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీజే డైరెక్టర్ అర్జున్‌రావు, సలహా కమిటీ సభ్యుడు వెంకట్రావు, కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీకాంత్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, జగదీశ్ పాల్గొన్నారు.

బోర్లు తవ్వడం అభివృద్ధి కాదు

బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



ప్రగతి ధర్మారంలో ఓటు వేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): అభివృద్ధి అంటే కేవలం బోర్లు తవ్వడం, ప్లేట్లు పంచడం కాదని బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో మైనంపల్లిని ఎద్దేవ చేశారు. సోమవారం మండల పరిధిలోని ప్రగతి ధర్మారం, అక్కన్నపేట, శివ్వాయపల్లి, సుతారిపల్లి, తొనిగండ్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంతకుముందు రెండుసార్లు గెలిచిన మైనంపల్లి మెదక్‌లో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎలాంటి అనుభవంలేని కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌ను గెలిపిస్తే ప్రజలు ఇబ్బందులపాలవుతారని హెచ్చరించారు.మహిళా గ్రూపుల్లో ఉన్న వారికి రూ. 3 వేల పింఛన్ జనవరి నుంచి ఇస్తామని సీఎం ప్రకటించడం హర్షనీయమని అన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీపీ భిక్షపతి, వైస్ ఎంపీపీ స్రవంతి సిద్ధరాంరెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బొడ్డు శంకర్, మల్లేశం, రాగి సంధ్య, మహేందర్‌రెడ్డి, జంగం నర్సవ్వ, పిట్ల రాణమ్మ, శివప్రసాదరావు, సుభాశ్, సురేశ్, శ్యాములు, చంద్రకళ, పంబాల జ్యోతి, ఎంపీటీసీలు మద్దూరి జ్యోతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేసిన వలె.. మృత్యుపాశమై..

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



పెంటయ్య మృతదేహం

పెద్దశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడికి తాను వేసి వలె మృత్యుపాశమైంది. చేపలకోసం వేసిన వల చిక్కుకొని మత్స్యకారుడు మృతి చెందిన ఘటన సోమవారం పెద్దశంకరంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పేటకు చెందిన బొగ్గుల పెంటయ్య(32) చేపలు పట్టుకొని అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం పెద్దశంకరంపేట మండలం సంగారెడ్డిపేట శివారులోని నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లాడు. నీటిలో వల విసిరిన తర్వాత ప్రమాదవశాత్తు అదే వలకు చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. అతడితో వెళ్లిన వారు గమనించి బయటకు తీసేలోపే మృతి చెందాడు. పెంటయ్యకు భార్య పుష్ప, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మా ఊరికి రాకండి!

- బీఆర్‌ఎస్ అభ్యర్థులకు నిరసన సెగలు
- ఏం అభివృద్ధి చేశారంటూ స్థానికులు నిలదీత
- ఎన్నికలు వచ్చినప్పుడే గుర్తొస్తామా?
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న నాయకులు



పాతూర్ గ్రామంలో పద్మాదేవేందర్‌రెడ్డి ప్రచారాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

మెదక్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు నిరసన సెగలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను మీ కార్యకర్తలకు ఇచ్చుకొని.. ఇప్పుడు మా ఓట్ల కోసం ఎందుకు వచ్చారని అధికార పార్టీ నాయకులను స్థానికులు నిలదీస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రచారానికి వెళ్తున్న అభ్యర్థులు, నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మెదక్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికే కేటాయించగా, ఆమె ప్రచారాన్ని అన్ని పార్టీల కన్న ముందుగానే ప్రారంభించారు. మెదక్ మండలం పాతూర్ గ్రామానికి ఈనెల 20న ప్రచారం కోసం వెళ్తుండగా, ముందుగానే తెలుసుకున్న కొందరు ఊరిలోకి రాకుండా దారికి అడ్డంగా బైకులు పెట్టారు. వాటిని బీఆర్‌ఎస్ నాయకులు తొలగించారు. ఈ సందర్భంగా నిరసన కారులు మాట్లాడుతూ.. మా గ్రామానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, బీఆర్‌ఎస్ నాయకులకు ఓటు అడిగే నైతికత లేదని మండిపడ్డారు.

దళితబంధు, బీసీబంధు ఇవ్వలేదంటూ..

హవేళిఘనపూర్ మండలం గంగాపూర్ గ్రామానికి ప్రచారానికి వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులకు నిరసన సెగ తలిగింది. మా గ్రామానికి పోడు పట్టాలు ఇవ్వలేదని, బీఆర్‌ఎస్‌కు ఓటు వేయలేమని అన్నారు. ఇదే మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో డబుల్ బెడ్రూంలు ఇవ్వలేదని, రోడ్లు కూడా సరిగ్గా లేవని, దళితబంధు, బీసీ బంధులతోపాటు పోడుపట్టాలు ఇవ్వలేదని ఎమ్మెల్యేను నిలదీశారు. మెదక్ మండలం వెంకటాపూర్ గ్రామానికి జెడ్పీవైస్‌చైర్మన్ లావణ్యారెడ్డితోపాటు మరికొంత మంది నాయకులు ప్రచారానికి వెళ్లగా మా గ్రామానికి ఒక్క దళితబంధు ఇవ్వలేదని ఎస్సీలు నిరసన తెలపడంతో నాయకులు వెళ్లి పోయారు. నార్సింగ్ మండలం కష్యాతండాకు ప్రచారం కోసం పేట మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లగా మా తండాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ప్రచారానికి రావొద్దని తండావాసులు నిరసన తెలిపారు.

సీఎం నియోజకవర్గంలోనూ..

నిరసన సెగలు సీఎం నియోజకవర్గ పరిధిలోని మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామంలో జరగడం గమనార్హం. జెడ్పీచైర్మన్‌తోపాటు మరికొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు ఇటీవల ప్రచారానికి వెళ్లి సీఎంకు ఓటు వేయాలని కోరగా మా గ్రామానికి దళితబంధు ఇవ్వలేదని ఎస్సీలు నిలదీశారు. బీసీలు, ముదిరాజ్‌లు ఈసారి సీఎంకు ఓటు వేయమని,ఈటెల రాజేందర్‌కు వేస్తామని చెప్పడంతో నాయకులు అవాక్కయ్యారు. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని భావిస్తున్న అధికార పార్టీ నాయకులకు ఆ పథకాల వల్లే ఇబ్బందులు తలెత్తుతుండడంతో తలలు పట్టుకుంటున్నారు.

ప్రచార పర్వంలో గులాబీ జోష్


బహిరంగ సభలో నమస్కరిస్తున్న సీఎం కేసీఆర్, ఖేడ్ బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి

సంగారెడ్డి జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నారాయణఖేడ్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ విజయవంతం కావడంతో పార్టీ నాయకుల్లో జోష్ నెలకొంది. సభకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. వేదిక పరిసరాలు గులాబీమయంగా మారాయి. కేసీఆర్ ప్రసంగం కార్యకర్తలను ఉర్రూతలూగించింది.


పాటలతో ఉర్రూతలూగించిన గాయకుడు ఏపూరి సోమన్న


కళాకారుల ఆటాపాట


నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పైకి ఎక్కి సీఎం ప్రసంగాన్ని వింటున్న జనం


సీఎం ప్రసంగిస్తుండగా ఫోన్‌లో వీడియో తీస్తున్న నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌రెడ్డి


సభలో వీడియో తీస్తున్న భూపాల్‌రెడ్డి కూతురు


కేసీఆర్ ఫొటో మాస్క్‌తో కార్యకర్త


సభలో పార్టీ కండువాలు ఊపుతూ నినాదాలు చేస్తున్న ప్రజలు

హైలైట్స్

- ఖేడ్‌లోని రహమాన్ ఫంక్షన్ హాల్ వద్ద సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ కోసం స్టేజ్ ఏర్పాటు చేశారు.
- మధ్యాహ్నం నుంచే ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
- 6 చోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించారు.
- వేదికపై ఏపూరి సోమన్న ఆటపాటలతో ఉత్సాహ పరిచారు.
- ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లతో సభావేదిక పరిసరాలు గులాబీమయంగా మారాయి.
- నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ వేదికపై నుంచి పలు సూచనలు చేశారు.
- వేదికపై కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి నృత్యం చేసి అలరించారు.
- సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కుటుంబీకులు సభా వేదికపైకి వచ్చారు.
- 4.28 గంటలకు కేసీఆర్ హెలీకాప్టర్‌లో సభాస్థలికి చేరుకున్నారు.
- 4.40 గంటలకు సీఎం స్టేజీపై వస్తుండగా ప్రజలు కరతాళ ధ్వనులు చేశారు.
- 4.41 గంటలకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి 6 నిమిషాల పాటు ప్రసంగించారు.
- సాయంత్రం 4.47 గంటలకు కేసీఆర్ ప్రసంగం 12 నిమిషాలపాటు కొనసాగింది.
- సాయంత్రం 5.15 గంటలకు సీఎం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

– మనూరు, కంగ్టి, కల్హేర్(నారాయణఖేడ్)

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్


టేక్మాల్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని అందోల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన టేక్మాల్‌తో పాటు కోరంపల్లిలో తనను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని, ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అన్ని రకాలుగా ఆదుకుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. తాను అందోల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులతో మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం టేక్మాల్ చౌరస్తాలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, ఎంపీపీ స్వప్నరవి, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సర్పంచ్‌లు సుప్రజా భాస్కర్, శ్రీనివాస్, నాయకులు ముక్తార్, సలీం, సిద్దయ్య, సర్దార్, మాణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి

వట్‌పల్లి(అందోల్): ప్రజలు తనను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దీవెనలతో ఐదేళ్ల పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానన్నారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గజేందర్‌రెడ్డి, చంద్రయ్య, మణిక్‌రెడ్డి, ఆబేద్, నాగేష్, ప్రభు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని జంగంపేట, వావిలాల, ఖాజీపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా సోమవారం బీఆర్ఎస్ యువజన నాయకులు మధుసూధన్‌రెడ్డి, విక్రంరెడ్డిలు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడోసారి మహిపాల్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధం ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలతో విజయం


అలయ్ బలయ్ ఇస్తున్న సునీత

పటాన్‌చెరు: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పథకాలతో విజయం సాధిస్తామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ సతీమణి సునీత అన్నారు. సోమవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పటాన్‌చెరు బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డికి ఓటు వేసి మూడో సారి గెలిపించాలని కోరారు.

నేరస్తులపై నజర్



- ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు
- జిల్లాలో భారీగా పాత నేరస్తుల బైండోవర్
- ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ముందస్తు కట్టడి

నారాయణఖేడ్: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పాత నేరస్థులు, నాటుసారా, బెల్ట్ షాపుల విక్రయదారులు, రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికపై పోలీసులు దృష్టిసారించారు. ఎన్నికల ప్రచారం జోరందుకోవడంతో పట్టణాలు, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న పాత నేరగాళ్ల సమాచారాన్ని అధికారులు సేకరిస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలో వారి హాజర నమోదు చేసి మండల కేంద్రాల్లో తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తున్నారు. అక్కడ బాండ్ పేపరులో పేర్కొన్న రీతిలో ఇకపై ఆరునెలలు, ఏడాదికాలం వరకు ఎలాంటి పనులు చేయబోనని, సత్ప్రవర్తనతో ఉంటానని, తప్పు చేస్తే శిక్షార్హుడిని అవుతానని అంగీకరిస్తూ స్వదస్తూరీ చేసి తహసీల్దార్‌కు అందించాల్సి ఉంటుంది. అవసరమైతే ఒకరి పూచీకత్తు సైతం తీసుకుంటారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,013మందిని బైండోవర్ చేశారు. ఇదే సమయంలో 3,205 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. బైండోవర్ చేసిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అలాగే వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ప్రతీవారం రిజిష్టర్‌లో సంతకం పెట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ బైండోవర్ కార్యక్రమాన్ని ఎన్నికల సమయంలోనే కాకుండా మామూలు రోజుల్లో కూడా చేస్తుంటారు.

మళ్లీ తప్పు చేయొద్దనే..

బైండోవర్ చేసిన వ్యక్తులు మళ్లీ తప్పులు చేయకుండా చూడటమే దీని ప్రధాన ఉద్దేశం. ఒకవేళ ఎవరైనా అతిక్రమిస్తే జరిమానా విధించేందుకు ఆస్కారం ఉంటుంది. జైలు శిక్షకూడా తప్పదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సదరు వ్యక్తులు తమ ప్రవర్తనను మార్చుకునే అవకాశం ఉంటుంది. మళ్లీ మళ్లీ ఆ తప్పులు చేయకుండా ఉంటారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడనని, శాంతి భద్రతలకు విఘాతం కలిగే పనులు చేయనని అతని నుంచి రాతపూర్వకంగా హామీ తీసుకుంటారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిని అరెస్టు చేస్తారు. బాండ్‌లో ఇచ్చిన హామీ మేరకు అంత మొత్తాన్ని అతని వద్ద నుంచి రికవరీ చేస్తారు. నిందితుడిని న్యాయస్థానంలో ప్రవేశపెడతారు. తప్పు, నేరం బట్టి బైండోవర్ సమయంలో నిర్దేశించే జరిమానా రూ.500 మొదలుకుని లక్ష రూపాయల వరకు విధిస్తుంటారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా


కాంగ్రెస్‌లో చేరుతున్న ఇతర పార్టీ నాయకులు

కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కోహెడ(హుస్నాబాద్): ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తానని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన 200 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతించారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అసమర్థ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే 250 గజాల ఇళ్ల స్థలాలను అమరవీరుల కుటుంబాలకు పంపిణీ చేస్తామన్నారు. నిధులు, నీళ్లు, నియామకాలే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దొమ్మట జగన్‌రెడ్డి, గోరిట్యాల లక్ష్మణ్, మంద ధర్మయ్య, బస్వారాజు శంకర్, పల్లె భూంరెడ్డి, రాగుల రాజమౌళి, వెంకటస్వామి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి


ప్రచారంలో పాల్గొన్న సతీశ్‌కుమార్

బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని ప్రతీ కార్యకర్త, నాయకుడు బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని హుస్నాబాద్ ఆ పార్టీ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని పరివేద, నకిరె కొమ్ముల, శ్రీరాములపల్లి, తీగలకుంటపల్లి, గొట్టమిట్ల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోను గ్రామ గ్రామాన ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగుల పెద్దిరెడ్డి, రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరి, మండలాధ్యక్షుడు ఆవుల మహేందర్, కోక్కుల సురేష్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలే గెలుపునకు కథానాయకులు

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ


సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణశర్మ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్యకర్తలే కేసీఆర్ గెలుపునకు కథానాయకులు కావాలని, లక్ష మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్‌కు చెందిన పార్టీ యూత్ నాయకులు, కార్యకర్తలతో గ్రామ కమిటీ అధ్యక్షుడు బుద్ద నాగరాజు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లో కేసీఆర్ మూడోసారి గెలవడం ఖాయమని అన్నారు. రాంనగర్ గ్రామానికి చెందిన ఇతర పార్టీల నాయకులు ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, బాలేశంగౌడ్, ఇంద్రసేనారెడ్డి, భూమయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రంగారెడ్డి, పాల్గొన్నారు.

దాడిపై నిష్పక్షపాతంగా విచారణ

సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత



సిద్దిపేటకమాన్: జిల్లాలోని దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం అన్ని వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మకూడదన్నారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినా, ప్రచారం చేసినా అలాంటివారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

మేనిఫెస్టోలో కార్మికుల డిమాండ్లు చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరుగనున్న ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల ప్రకటించే మేనిఫెస్టోలో ఉద్యోగ, కార్మికుల, అసంఘటిత రంగ కార్మికుల డిమాండ్లను చేర్చాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కార్మిక, కర్షక భవన్, ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అధ్యక్షతన సీఐటీయూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయని బీఆర్ఎస్ ఓటమి భయంతోనే మోసపూరిత హామీలు ఇస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలను ఓడించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోల్లో కార్మికుల ప్రస్తావన చేయని పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, గ్రామ పంచాయతీ కార్మికుల, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, ఉపాధ్యక్షురాలు కళావతి, మధు, కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శి రవికుమార్, చంద్రారెడ్డి, శోభ, జిల్లా కమిటీ సభ్యులు వేణుగోపాల్, రంగారెడ్డి, కనకయ్య, సుధాకర్, భాస్కర్, రవీందర్, వెంకటయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి భారీ షాక్

కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన శివరాజ్‌పాటిల్


సీఎం కేసీఆర్‌తో శివరాజ్‌పాటిల్

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు శివరాజ్ పాటిల్ గులాబీ కండువా కప్పుకున్నాడు. ఆయనతో పాటు బీజేపీ సంగారెడ్డి నియోజకవర్గ కో కన్వీనర్ రేజింతల సత్యనారాయణ, బీజేపీ సదాశివపేట మండల మైనార్టీ అధ్యక్షులు జలీల్, యూత్ కాంగ్రెస్ జిల్లా యువ నాయకుడు ప్రభుగౌడ్‌లు కూడా గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. సంగారెడ్డి నుంచి బీజేపీ టికెట్ ఆశించిన శివరాజ్ ఎవరూ ఊహించని విధంగా బీఆర్ఎస్ చేరడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. నవంబర్ మొదటి వారంలో సదాశివపేట పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించి నియోజకవర్గ పరిధిలోని తన 5000 వేల మంది అనుచరులు, అభిమానులను బీఆర్ఎస్ పార్టీలో చేర్పించి చింతా ప్రభాకర్ గెలుపుకు కృషి చేస్తానని శివరాజ్‌పాటిల్ స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిపొందే విధంగా ఉన్నందువల్లనే పార్టీ మారినట్లు చెప్పారు.

రఘునందన్‌రావు వాహనం తనిఖీ


బోనాల్ శివారులో రఘునందన్‌రావు వాహనం తనిఖీ చేస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల్ గ్రామంలో ఎన్నికల స్టాటిక్ సర్వేలెన్స్ టీం లీడర్ యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు వాహనం సోమవారం తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా శివారులో స్టాటిక్ సర్వేలెన్స్ బృందం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అటుగా వచ్చిన ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేశారు. దీనికి ఆయన సహకరించినట్లు టీం లీడర్ యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.